
ప్రజాశక్తి
సోమవారం 4 మార్చి 2024
5
విజయనగరం



ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వనిత వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక తిరుమల మెడికవర్ ఆసుపత్రి సమావేశ మందిరంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రముఖ గైనకాలజిస్ట్ కె.కృష్ణ శాంతి, ప్లాస్టిక్ సర్జన్ శ్రావణి, రేడియాలజిస్ట్ దివ్యలను ఘనంగా సత్కరించారు. వాకర్స్ క్లబ్ గవర్నర్ జె.నారాయణస్వామి మాట్లాడుతూ సమాజంలో అత్యున్నతమైన పాత్రలను పోషిస్తున్న మహిళలను మహిళా దినోత్సవం సందర్భంగా గౌరవించుకోడం సామాజిక బాధ్యతని అన్నారు. క్లబ్ అధ్యక్షులు ఎం.సుభద్రదేవి, సాయి సంతోషిణి, కోశాధికారి సిహెచ్ పార్వతి, నాలుగెస్సుల రాజు, కొత్తలి ఎర్రినాయుడు, పూర్వపు గవర్నర్ కర్రోతు సత్యం, పప్పు విశ్వనాథం, ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల ముందే తాయిలాలిస్తూ...

ఔను...! సిద్ధమయ్యారు... ఎన్నికలకు ముందే ఆత్మీయ సమావేశాల నిర్వహణకు, ఆ పేరిట కానుకల పంపిణీకి అధికార పార్టీ సిద్ధమైంది. అక్కడక్కడా ప్రతిపక్షమూ అటువంటి దారిలో నడిచేందుకు ఇప్పుడిప్పుడే బయలుదేరినట్టుగా కనిపిస్తోంది. సుమారు పది రోజులుగా అధికార పార్టీ అభ్యర్థులు, ఇన్‌ఛార్జులు ఆధ్వర్యాన విందులు, వినోదాలు ప్రారంభమయ్యాయి. అందులోనే చీరలు, సారెలు తదితర కానుకల పంపిణీ సాగుతోంది. ఎన్నికల్లో వివిధ తరగతులను లోబరుచుకోవడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు సాగుతున్నాయని జనం చర్చించుకుంటున్నారు. బహుషా ఎన్నికల కోడ్‌కు ముందే ఇటువంటి కార్యక్రమాలన్నీ పూర్తవుతాయేమో!!.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



- ఆత్మీయత పేరిట కానుకలు ఎర
- నోటిఫికేషన్‌కు ముందే ప్రారంభం

గతంలో పరిమితమైన స్థానాల్లో మినహా ఎన్నికల నోటిఫికేషన్ వరకు అభ్యర్థులు జాబితా విడుదలయ్యేది కాదు. అటు టిడిపి, ఇటు వైసిపి ఏడాది క్రితం నుంచి ఎన్నికల వాతావరణం సృష్టించడంతో ఇరు పార్టీల్లోనూ దాదాపు సగం మంది అభ్యర్థుల పేర్లు ఖరారైపోయాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అధికార పార్టీ తరపున దాదాపు సిట్టింగులేనని లోలోపల ఖరారు చేసినట్టుగా సమాచారం. ఇటు టిడిపి కూడా మూడు చోట్ల మినహా మిగిలిన అన్ని చోట్లా అభ్యర్థులను ప్రకటించింది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ, దానికి ముద్దతుగా మరో సంస్థ ఓ అడుగు ముందుకు వేసి వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వృద్ధులు, వికలాంగులు, ఉపాధ్యాయులతో సభలు, సమావేశాలు నిర్వహించి అందులో విందులు, వినోదాలతో ముంచెత్తుతున్నాయి. ఇటువంటి కార్యక్రమాలు ఇప్పటి వరకు గజపతినగరం, విజయనగరం, పార్వతీపురం, శృంగవరపుకోట తదితర చోట్ల బహిరంగంగానే జరుగుతున్నాయి. పార్వతీపురంలో అధికార పార్టీకి చెందిన ఓ నేత ఏకంగా చీరలతోపాటు డబ్బులు కూడా పంపిణీ చేశారు. విజయనగరంలో నెల రోజుల క్రితం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమైన నేత, నేడో రేపో ఏకంగా ఉపాధ్యాయల కుటుంబాలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. అందులో కానుకలు కూడా పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టుగా కూడా ప్రచారం జరుగుతోంది.

సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితర విభాగాలకు వైసిపి తరుపున ఓ సంస్థ కూడా బహుమతులు ప్రదానం చేస్తున్నట్టుగా చర్చ నడుస్తోంది. నోటిఫికేషన్ తరువాత ఇటువంటి కార్యక్రమాలు, పంపిణీ వంటివి నిర్వహిస్తే ఎన్నికల నిబంధనావళి అడ్డువస్తుందనే ఆలోచనతో ముందస్తుగానే సిద్ధమౌతున్నట్టుగా అర్థమౌతోంది. విందులు, కానుకలతో ఎన్నికల్లో గట్టెక్కాలని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఓటర్లు మాత్రం అందుకు సిద్ధం కాబోరని, ఇచ్చినవన్నీ తీసుకుని బాగా ఆలోచించే ఓటేస్తారని ఆశిద్దాం.

అగ్రహారం కథ కంచికేనా?

- నోటిఫికేషన్ ఇచ్చి 10 నెలలు దాటుతున్న వైనం
- అభ్యంతరాలపై అతీగతీ లేదంటున్న రైతులు
- ఇనాం 1/3 కేటాయింపుపై స్పష్టత కరువు
- అయోమయంలో అన్నదాతలు



జామిలోని అగ్రహారం భూములు

అగ్రహారం భూముల కథ కంచికేనా? అంటే... అవుననే సమాధానం వస్తోంది. తాతలు, తండ్రుల కాలం నుంచి హక్కులు లేకుండా అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారుతున్నారు తప్ప అగ్రహార భూముల సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఈ నేపథ్యంలోనే గత ఏడాది మే 25న భూములకు అప్పటి తహశీల్దార్ పబ్లిక్ నోటిఫికేషన్ వేసి అన్నదాతల్లో ఆశలు రేపారు. తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూములను ఇనాం కింద 1/3 వాటా కేటాయించిన అధికారులపై మండిపడినా, భూసమస్య పరిష్కారానికి నోచుకుంటుందని ఆశ పడ్డారు. నోటిఫికేషన్‌లోని ఉన్న అనేక తప్పులు తడకలున్నా సమస్య పరిష్కారం కోసం ప్రశ్నించకుండా అధికారులకు సహకరించాలని భావించారు. తమ భూములపై అభ్యంతరాలను అధికారుల సూచనల మేరకు అందజేశారు. ఈ ప్రక్రియ జరిగి సుమారుగా 10 నెలలు కావస్తున్నా... అగ్రహారంపై అడుగు ముందుకు పడలేదు. మరో 45 రోజుల్లో ఎన్నికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాశక్తి - జామి

జామి మండల కేంద్రంలో సుమారుగా 2600 ఎకరాల వరకు ఇనాం భూములు (అగ్రహారం) కింద ఉన్నాయి. వీటికి హక్కుల కోసం రైతులు ఏళ్లగా ఎదురు చూస్తున్నారు. 2009లో భూ సర్వే ప్రారంభమై, గత ఏడాది 25న అప్పటి తహశీల్దార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 30 రోజుల్లో నోటీసులో పొందుపర్చిన వివరాలపై అభ్యంతరాలు తెలపాలని పేర్కొన్నారు. అంతుపట్టని పలు అంశాలు నోటిఫికేషన్‌లో రావడంతో అప్పట్లో రైతులు గందరగోళానికి గురయ్యారు. ప్రధానంగా నోటిఫికేషన్ లో ఇనాం దారుని పేరు రాయకుండానే ఇనాం వాటా కింద 1/3 భూమిని కేటాయించడం గందరగోళాన్ని సృష్టించింది. ఇనాం అండ్ ఎస్టేట్ ఎనాలిసిన్ యాక్ట్ ప్రకారం, సాగుదారునికి 2/3, ఇనాం దారునికి 1/3 వాటా భూమి కేటాయించడం న్యాయమే. కానీ తాతల తండ్రుల కాలం నుంచి కానారాని ఇనాందారుడి పేరున భూ కేటాయింపు చేయడం ఏమిటని ప్రశ్నలు లేవనెత్తారు. ఒకవేళ నిజంగా ఇనాందారు పేరు రికార్డుల్లో ఉంటే, పబ్లిక్ నోటిఫికేషన్‌లో ఎందుకు పొందు పరచలేదనే వాదన లేకపోలేదు. మొత్తం అగ్రహారం భూమిలో కేవలం 2049 ఎకరాలకు మాత్రమే వేయడం, మిగులు భూముల వివరాలు, వాటి పరిస్థితిని ఎందుకు నోటిఫికేషన్‌లో పొందుపర్చలేదన్న ప్రశ్నలు అనేకం వెల్లువెత్తాయి. వీటితో పాటు ఇనాందారుల నుంచి కొనుక్కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు, తహశీల్దార్ కార్యాలయం నుంచి 300 లకు పైగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందినవారు, వీటితో పాటు గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణలో నష్టపోయిన రైతుల పరిస్థితులు ఎక్కడా నోటిఫికేషన్‌లో కనిపించలేదు. అయినప్పటికీ అధికారులు చెప్పిన మాటలకు కట్టుబడి... నోటిఫికేషన్ ప్రక్రియ ముందుకు సాగాలని రైతులు భావించారు. కానీ సుమారుగా పది నెలల కావస్తున్నా...నోటిఫికేషన్ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అగ్రహారం భూ సమస్యపై పూర్తి స్థాయి స్పష్టత ఇచ్చేలా, అధికారులు చర్యలు తీసుకుంటారని రైతులు ఆశిస్తున్నారు.

ఎన్నికల పనుల్లో ఉన్నాం

జామి అగ్రహార భూముల నోటిఫికేషన్‌పై తహశీల్దార్ వి.రాంబాయిని 'ప్రజాశక్తి' వివరణ కోరగా... రెవెన్యూ యంత్రాంగం మొత్తం ఎన్నికల పనుల్లో నిమగ్నమై ఉందని చెప్పారు. అగ్రహార భూముల సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి అదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా గౌతమి

ప్రజాశక్తి-విజయనగరంకోట

చింతవలస ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా గౌతమి శాలి నియమితుయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో జిల్లాలో బొబ్బిలి డిఎస్‌పిగా గౌతమి పనిచేశారు.

మహిళలకు ఉన్నత స్థానం

జనసేన నేత పాలవలస యశస్వి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రస్తుత రాజకీయాల్లో మహిళలకు ఉన్నత స్థానమిచ్చిన పార్టీ కేవలం జనసేన మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి అన్నారు. జనసేన పార్టీలో కీలక భాధ్యతలు నిర్వహించి, వైసిపిలో చేరిన చేగొండి హరిరామజోగయ్య కుమారుడు సూర్యప్రకాశ్ పార్టీపై తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని ఆమె ఖండించారు. విజయనగరంలో తననివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సూర్యప్రకాశ్‌కు జనసేన పార్టీలో మంచిగుర్తింపు ఇచ్చినప్పటికీ ఆయన స్వలాభం కోసం వేరే పార్టీలోకి మారారని చెప్పారు. అలా మారినప్పుడు వీడిన పార్టీ, పార్టీ అధినేతల గురించి విమర్శలు చేయడం సరికాదన్నారు. జనసేన పార్టీలో నాయకులకు, మహిళలకు సరైన గుర్తింపు లేదని వ్యాఖ్యానించడం చాలా దారుణమన్నారు. జనసేన పార్టీలో మంచి పదవుల్లో ఉన్న తమపై సూర్యప్రకాశ్ తన స్వలాభం కోసం అసత్యాలు వల్లెవేయడం సరికాదని హితవుపలికారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

- జూన్ నుంచి విడుదల కాని నిధులు
- రూ.14.60 కోట్ల బకాయి
- అప్‌లోడ్ చేసేందుకు సిద్ధంగా మరో రూ.3 కోట్లు బిల్లులు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నగర పాలక సంస్థలో చేపడుతున్న అభివృద్ధి పనులకు బిల్లుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. 2021 నుంచి రోడ్లు, కాలువలు, వాటర్ ట్యాంకలు, పార్కులు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులను నగర పాలక సంస్థలో సుమారుగా 30 మందికి పైగా ఉన్న కాంట్రాక్టర్లు టెండర్లు వేసి చేపడుతున్నారు. అయితే నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నంత వేగంగా బిల్లులు చెల్లింపు కావడం లేదు. నగర పాలక సంస్థలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారుగా 600 పైగా అభివృద్ధి పనులు చెయ్యాలని కౌన్సిల్‌లో తీర్మానించారు. చేసిన పనులకు మాత్రం సకాలంలో బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కనిపిస్తోంది. 600 పైగా పనులు చేయాలని నిర్ణయిస్తే వాటిలో 400 వరకు పనులు పూర్తి చేశారు. వాటిలో కూడా ఎక్కువగా నగర పాలక సంస్థ ఆదాయం నుంచి చేసినవే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సిఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాల్సిన బిల్లులు చెల్లించక పోవడంతో రోజురోజుకూ పనులు చేసే కాంట్రాక్టర్లు సంఖ్య తగ్గుతూ వస్తుంది. కొంతమంది కాంట్రాక్టర్లు ఇప్పటికే ఇతర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారు.

విజయనగరం నగర పాలక సంస్థ గత ఏడాది జూన్ నుంచి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు సుమారుగా రూ.8.50 కోట్లు మేర ఉన్నాయి. దీనిలో సాధారణ నిధుల నుంచి రూ.4.45 కోట్లు, 2021 సంవత్సరంలో వచ్చిన 15వ ఆర్థిక సంవత్సరం నిధులు రూ.3.59 కోట్లు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద రావాల్సింది రూ.52 లక్షలు ఉన్నాయి. వీటితోపాటు విద్యుత్తు శాఖకు చెల్లించాల్సిన బిల్లులు రూ.6.10 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లులు గత ఏడాది జూన్ నుంచి చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడంలేదు. దీంతో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.40 కోట్లతో చేపట్టాల్సిన 200కు పైగా పనులు నిలిచి పోయాయి. మరో వైపు ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో బిల్లులు వస్తాయో? రావోనని భయంతో కాంట్రాక్టర్లు ఉన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉండటంతో నగర పాలక సంస్థ కార్యాలయం చుట్టూ కాంట్రాక్టర్లు తిరుగుతున్నారు.

విద్యుత్తు బిల్లులు బకాయి రూ.6.10 కోట్లు

నగర పాలక సంస్థ విద్యుత్తు బిల్లు బకాయి రూ.6.10 కోట్లు విద్యుత్తు శాఖకు చెల్లించాల్సి ఉంది. బిల్లు చెల్లించక పోవడంతో అదనంగా మరో రూ.10 లక్షలు నుంచి రూ.15 లక్షలు సర్‌ఛార్జి భారం పడింది. పుండు మీద కారం చల్లిన చందంగా మరో 15 లక్షలు జరిమానా చెల్లించాల్సి వస్తుందని నగర పాలక సంస్థ అధికారులు వాపోతున్నారు.

మరో రూ.3 కోట్ల బిల్లులు సిద్ధం

ఇప్పటికే రూ.14 కోట్లు పైగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా, నగర పాలక సంస్థ అధికారులు మరో మూడు కోట్లు నిధులకు బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే సిఎఫ్ఎంఎస్ ద్వారా రావాల్సిన నిధులు రాకపోవడంతో కొత్త బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు సాహసం చేయడం లేదు. మరోవైపు ఏ క్షణంలోనైనా ప్రభుత్వం డబ్బులు విడుదల చేస్తుందేమోనని కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల కోడ్ రానుండడంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట



చిన్నారికి పోలియోచుక్కలు వేస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు రక్షణ ఇస్తాయని, ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు పిలుపునిచ్చారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని కంటోన్మెంట్ పార్కులో ఆదివారం ఆయన ప్రారంభించారు. పిల్లలకు పోలియో చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు వయసున్న పిల్లలు సుమారు లక్షా 98 వేల మంది ఉన్నారని తెలిపారు. వీరందరికీ పోలియో చుక్కలు వేయడానికి 1184 పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు వద్ద కూడా పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. మారుమూల ప్రాంతాలు, మురికివాడలు, సంచార తెగల పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేసేందుకు ప్రత్యేక చర్యలను చేపట్టినట్లు వెల్లడించారు. మొబైల్ బృందాలను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఐఒ అచ్యుతకుమారి, ఎంహెచ్ఒ సాంబమూర్తి, డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : పోలియో రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్‌సిఎస్ థియేటర్ వద్ద ఏర్పాటుచేసిన ఎండ్ పోలియో నౌ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఫిల్మ్ ఫెస్టివల్‌ను కోలగట్ల ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ఆర్‌కె జైన్, రవి మండ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇవ్వాలి

విజయనగరం టౌన్ : రానున్న ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇవ్వాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెవ్వూరి రామస్వామి కోరారు. ఆదివారం విజయనగం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులు రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణులకు రానున్న ఎన్నికల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. విశ్వబ్రాహ్మణుల పరిస్థితి నానాటికి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు కూడా అంతంత మాత్రమే అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, పొన్నపల్లి అప్పారావు, నాగభూషణం, కోసూరు రాంబాబు, మందవరపు వరదాచారి, లక్కోజు శేఖర్, గోడి అరుణ, వేముల ప్రకాశం పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

టిడిపి నేత అశోక్‌గజపతిరాజు



మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం కోట


మంచి ప్రవర్తనతో కూడిన నాయకులను ఎన్నుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రజలను కోరారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఆయన హయాంలో చేసిన అభివృద్ధి పనుల వీడియో సీడీని మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ పి.సునీల గజపతి రాజు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఏదైనా మంచి పనులు, విజయాలు సాధించామంటే.. అది ప్రజలు విజయమన్నారు. సంక్షేమ పథకాల తొలగింపులో జగన్ ప్రభుత్వం ముందుందన్నారు. అరాచపాలన తప్ప అభివృద్ధి లేదన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్‌కుమార్, గాడు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ ఆశయాలు జగన్‌తోనే సాధ్యం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



వైఎస్ఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను సిఎం జగన్మోహన్ రెడ్డి నెరవేరుస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం ద్వారపూడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యానికి సిఎం జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. అవినీతి రహితంగా పథకాలు అందేలా చూస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డోల మన్మథకుమార్, వైసిపి మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాథరావు, ఎఎంసి ఛైర్‌పర్సన్ నడిపేన శశి భార్గవి, బొద్దుల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు, స్వామి వివేకానంద విగ్రహాలు ఆవిష్కరణ

ఉడా కాలనీలో ఆర్యవైశ్య సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వామి వివేకానంద, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ముమ్మిడిశెట్టి సత్యనారాయణ, కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి త్రినాథ్, అమరజీవి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆలవెళ్లి శేఖర్, కార్యదర్శి సముద్రాల నాగరాజు, కార్పొరేటర్ నారాయణప్పుడు, డి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

త్వరలో అపరాల కొనుగోలు

- మినుములు క్వింటాకు మద్దతుధర రూ.6,950
- పెసలు క్వింటా రూ.8,558
- ఆశాజనకంగా మొక్కజొన్న
- 'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.టి.రామారావు ముఖాముఖి



త్వరలో పెసలు, మినుములు తదితర అపరాల కొనుగోలుకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.టి.రామారావు వెల్లడించారు. మినుములు, పెసలకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఇంతకన్నా తక్కువ ధరకు రైతులు విక్రయించాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ ఏడాది రబీలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉందని, మరో 15 రోజుల్లో పంట చేతికి అందుతుందని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

\- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

? ఈ ఏడాది రబీసాగు ఎంత.?


గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రబీ విస్తీర్ణం తగ్గింది. రబీ సాధారణ విస్తీర్ణం 1,62,305 ఎకరాలు కాగా, ఈ ఏడాది 1,00,621 ఎకరాల్లో మాత్రమే సాగు ఉంది. సాధారణ సాగుతో పోలిస్తే 61,684 ఎకరాలు, గతేడాదితో పోలిస్తే 28,775 ఎకరాల చొప్పున సాగు విస్తీర్ణం తగ్గింది. వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడమే ఇందుకు కారణం.

? మినుములు, పెసల మద్దతు ధర ఎంత.?

మినుములు క్వింటా రూ.6,950, పెసలు క్వింటా రూ.8,558 చొప్పున కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర నిర్ణయించింది. ఈ ఏడాది మినుములు 48,936 ఎకరాలు, పెసలు 24,147 ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. ఇప్పటి వరకు సుమారు 60శాతం కోతలు పూర్తయ్యాయి. మినుములు ఎకరాకు 250 కేజీలు, పెసలు 130 కేజీల చొప్పున దిగుబడి వచ్చింది.

? కొనుగోలు కేంద్రాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తారు.?

జిల్లాలో సుమారు 20 చోట్ల అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించి ఇప్పటికే మార్క్‌ఫెడ్ కమిషనర్‌కు పంపాం. జెసి ఆధ్వర్యాన వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు కలిసి ఈ ప్రతిపాదన చేశాం. అపరాల సాగు గంట్యాడ, వేపాడ, ఎల్.కోట, జామి, విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, తెర్లాం, దత్తిరాజేరు, మెంటాడ, బొండపల్లి, సంతకవిటి, రాజాం తదితర మండలాల్లో ఎక్కువగా ఉంది.



? మొక్కజొన్న సాగు, మద్దతు ధర ఏ విధంగా ఉన్నాయి.?

మొక్కజొన్న ఈ ఏడాది 45,070 ఎకరాల్లో సాగైంది. గత ఏడాదితో పోలిస్తే పంట ఆశాజనకంగానే ఉంది. మరో 15 రోజుల్లో పంట కోతలు కూడా పూర్తవుతాయి. క్వింటా రూ.2090 చొప్పున ప్రభుత్వం కనీస మద్దతు ధర నిర్ణయించింది.

? ఇ-క్రాప్, ఇ-కెవైసి ఎంత వరకు వచ్చాయి.?

ఇ-క్రాప్ సుమారు 99 శాతం వరకు పూర్తయింది. ఇ-కెవైసి కూడా 95 శాతం దాటింది. పంటల బీమాతోపాటు రైతు భరోసా, పంటల కొనుగోలు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీకి ఇ-కెవైసి అత్యంత కీలకంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులంతా స్థానిక ఆర్‌బికెలకు వెళ్లి తప్పక ఇ-కెవైసి చేయించుకోవాలి. లీగల్, ఆధార్ సాంకేతిక సమస్యలు ఉన్నవారు సంబంధిత మండల వ్యవసాయ శాఖ అధికారులు, తహశీల్దార్ల అంగీకార పత్రాలు తీసుకుంటే సమస్య పరిష్కారమౌతుంది.

బ్యాడ్మింటన్ కోర్టుకు స్థలం కేటాయిస్తాం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు కోసం త్వరలోనే స్థలాన్ని కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు స్పష్టం చేశారు. తొలుత అనుకున్న స్థలానికి సంబంధించి కొంత మంది వ్యతిరేకించడం వలన ప్రత్యామ్నాయ స్థలం కోసం ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం రెండు స్థలాలను గుర్తించామన్నారు. నెల్లిమర్ల బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఇప్పటికే వైశ్య కులస్తుల కోరిక మేరకు అమ్మవారి దేవాలయానికి స్థలం ఇచ్చామని, నాయీ బ్రాహ్మణులు విన్నపం మేరకు కమ్యూనిటీ భవనం కోసం స్థలం ఇచ్చామని వందేళ్లుగా నెల్లిమర్లకి ఉన్న స్వర్గ ధామ సమస్య కూడా పరిష్కరించే దిశగా చర్యలు వేగవంతం చేశామని చెప్పారు. ఇదే క్రమంలో షెటిల్ బ్యాడ్మింటన్ కోసం కూడా కోర్టుని మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన పి.పైడిరాజు, మీసాల శ్రీను, లెంక శ్రీను, టి. శ్రీనులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, అసోసియేషన్ ప్రతినిధులు వి.ఎం.కె. లక్ష్మణరావు, బయిరెడ్డి సంతోష్, పంచాది కిరణ్, సురేష్, శేఖర్, రంగారావు, ప్రకాశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ విజయానికి సహకరించాలి

ప్రజాశక్తి- గంట్యాడ

గజపతినగరం నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న కొండపల్లి శ్రీనివాసరావు విజయానికి అందరూ సహకరించాలని మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు కోరారు. ఆదివారం బోనంగి, సిరిపురం గ్రామాలలో పర్యటించి ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ స్వర్గీయ కొండపల్లి పైడితల్లి నాయుడును గుర్తుచేసుకొని మరల తమ కుటుంబానికి అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

ప్రజాశక్తి - గుర్ల

మండలంలో కోటగండ్రేడు గ్రామంలో సీజ్ చేసిన ఇసుకను సోమవారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో చంపావతినది సమీపంలో ఉన్న ముద్దాడ మధు మామిడి తోటలో గుర్ల పోలీసు స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన సుమారు 60 టన్నులు ఇసుకను తహశీల్దార్ సమక్షంలో వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు ఉదయం 10గంటలకు అక్కడకు చేరుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- వేపాడ

మండల కేంద్రంలోని సచివాలయం ఆవరణంలో ఆదివారం ఎన్‌టిఆర్ సేవాసమితి ట్రస్టు అండ్ ఎంవివిఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. టిడిపి విశాఖ పార్లమెంటరీ ఇంచార్జి శ్రీభరత్ సహకారంతో, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో విశాఖ గీతం దంత వైద్య కళాశాల వైద్యులు ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ప్రారంభించారు. ఈ శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి ఒబ్బిన సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, నాయకులు కొట్యాడ రమణమూర్తి, దాసరి లక్ష్మి, పోతల వెంకటరమణ, వీలుపర్తి సర్పంచ్ శానాపతి అప్పారావు, గుంటుపల్లి దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.

6న జనసేన కార్యాలయం ప్రారంభం

బొబ్బిలి: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయం జంక్షన్ యూనియన్ బ్యాంక్ మేడపైన జనసేన కార్యాలయాన్ని ఈ నెల 6న ప్రారంభించనున్నట్లు నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ బొమ్మ జంక్షన్‌లో ఉన్న కార్యాలయాన్ని యూనియన్ బ్యాంక్ మేడపైకి మారుస్తున్నామని చెప్పారు. కార్యాలయం ప్రారంభానికి జనసైనికులు హాజరవ్వాలని కోరారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టిడిపి ఉమ్మడి అభ్యర్థి బేబినాయన గెలుపునకు పని చేయాలని పిలుపునిచ్చారు.

బియ్యం పంపిణీ

విజయనగరంకోట: కెఆర్ హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.కాంతారావు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేట సాకేటివీధిలో పేదలకు బియ్యం పంపిణీ చేశారు. కాంతారావు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంగా గత 8 నెలల నుంచి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముద్దాడ మధు, వైసిపి విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జూకటి కిరణ్, యాత కార్పొరేషన్ డైరెక్టర్ అప్పలరాజు, ట్రస్ట్ సభ్యులు బి.కిరణ్ కుమార్, మేడూరు నవీన్, దాస్, అనిల్, రామునాయుడు పాల్గొన్నారు.

వైసిపితోనే బిసిల అభివృద్ధి

ప్రజాశక్తి -విజయనగరంటౌన్

బిసిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని 22వ డివిజన్ కార్పొరేటర్ బి.సతీష్ అన్నారు. ఆదివారం కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం డివిజన్‌లో పర్యటించిన టిడిపి నాయకులు ఎమ్మెల్యేపైన అసభ్య పదజాలంతో మాట్లాడటం సరికాదన్నారు. బిసిల కోసం టిడిపి చేసిందేమీలేదన్నారు. టిడిపి నాయకులు మాదిరిగా అహంకారంతో కులాలు పెంచేయడం, కుల, మతాలకు అతీతంగా పాలన అందిస్తున్నారని చెప్పారు. సమావేశంలో నాయకులు రామేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

వైసిపిలో చేరికలు

విజయనగరం టౌన్ : నగరంలోని కొన్నగుడ్డి ప్రాంతానికి చెందిన 25 కుటుంబాలు జనసేనను వీడి వైసిపిలో చేరాయి. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసం వద్ద ఆయన సమక్షంలో వైసిపిలో చేరారు. కోలగట్ల పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, కార్పొరేటర్ దుప్పాడ సునీత, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, కార్పొరేటర్ అల్లు చాణక్య, దుప్పాడ సైడి, చందక సూరకరావు, తాలాడ జయరాం, ముక్కు కుమార్, గోక ప్రసాద్ పాల్గొన్నారు.

తాకట్టుతో అభివృద్ధి సాధ్యమా?

విజయనగరం కోట : తాకట్టుతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమా? అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.అదితి గజపతిరాజు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం నగరంలోని 38, 39 డివిజన్ల పరిధిలో ఆమె పర్యటించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అథోగతిపాలు చేసి ఆఖరికి జగన్... ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి తీసుకొచ్చారని విమర్శించారు. చివరికి రాష్ట్ర సచివాలయం కూడా తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్ పాల్గొన్నారు.

వాకర్స్‌తో అదితి ... అయోధ్య మైదానంలో వాకర్స్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు కలిశారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వారికి వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి-జనసేనకు మద్దతు పలకాలని కోరారు.

భోగాపురంలో రాజకీయ పంచాయితీ

- మేజర్ పంచాయతీలో అధికార పార్టీకి షాక్
- వైసిపిని వీడేందుకు నాయకుల నిర్ణయం
- కాకర్లపూడిని కలిసిన వైనం
- రఘుబాబు దృష్టిలో పెట్టి నిర్ణయం తీసుకోవాలని సూచన

ప్రజాశక్తి - భోగాపురం

ఎన్నికలు దగ్గరపడుతుండడంతో భోగాపురం మేజర్ పంచాయతీలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అధికార పార్టీని వీడి ఏదో ఒక పార్టీలో చేరాలని భోగాపురం పంచాయతీలోని కొంత మంది నాయకులు, యువత ఆదివారం సమావేశమయ్యారు. గత కొన్నాళ్ల నుంచి అధికార పార్టీలో అసంతృప్తిగా ఉన్న కాకర్లపూడి శ్రీనుబాబును వీరంతా కలవడం చర్చనీయాంశంగా మారింది. మీరంతా ఏ నిర్ణయం తీసుకున్నా దానికి ప్రకారమే నడుచుకుందామని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. అయినప్పటికి భోగాపురం అధికార పార్టీకి చెందిన పెద్దలైన కందుల రఘుబాబు దృష్టిలో పెట్టి ఒక నిర్ణయం తీసుకోవాలని వారందరికి శ్రీనుబాబు సూచించినట్లు చెబుతున్నారు. దీంతో అధికార పార్టీని వీడేందుకు వేగంగా పావులు కదుపుతున్నారు. మరి కందుల రఘుబాబు ఏ నిర్ణయం తీసుకుంటారనేదానిపై ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

భోగాపురం పంచాయతీలోని కొంత మంది అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ మారాలనే నిర్ణయానికి వచ్చారు. ఏదో ఒక పార్టీలో చేరాలని అది టిడిపి, జనసేనా అంటే జనసేన వైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ఎందుకంటే జనసేన, టిడిపి పొత్తులో భాగంగా జనసేనకు ఇక్కడ టికెట్ కేటాయించడంతో అందులో చేరాలనే ఎక్కువ మంది


కాకర్లపూడి శ్రీనివాసరాజుతో చర్చిస్తున్న వైసిపి నాయకులు

అనుకుంటున్నారు. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు సుమారు 60మంది వరకు ఆదివారం సమావేశమై శ్రీనుబాబును కలిశారు. ఇప్పటికైనా పార్టీ మారకపోతే తమకు భవిషత్తు ఉండదని తెలియజేశారు. జగన్‌మోహన్ రెడ్డి పార్టీ స్థాపించిన తరువాత ఉత్తరాంధ్ర నుంచి పార్టీలోకి వెళ్లిన మొట్ట మొదటి వ్యక్తి కాకర్లపూడి శ్రీనుబాబు. ఆయనకు ఇప్పటి వరకు ఎటువంటి నామినేటడ్ పదవులు ఇవ్వకపోవడంతో ఆయన గత కొంత కాలం నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఒక సందర్భంలో ఎమ్మెల్యే కూడా శ్రీనుబాబుతో పాటు భోగాపురం గ్రామానికి చెందిన కొంత మంది నాయకులపై బహిరంగ విమర్శలు చేశారు. అటువంటి పార్టీలో తామంతా ఎందుకు ఉండాలనే నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు.

రఘుబాబు దృష్టిలో పెట్టాలని నిర్ణయం

పార్టీ మారే విషయం పెద్దలైన కందుల రఘుబాబు దృష్టిలో పెట్టాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఆయనకు ఒక మాటి చెప్పి అధికార పార్టీని వీడాలనే నిర్ణయానికి వచ్చారు. ఈయనకు పార్టీలో సరైన నామినేటెడ్ పదవి లభించకపోవడంతో ఆయన అభిమానులు కూడా అసంతృప్తిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారనే విషయం ఆసక్తికరంగా మారింది. అయన పార్టీ మారవద్దని బుజ్జగించినాసరే శ్రీనుబాబుతో పాటు చాలా మంది అధికార పార్టీని వీడాలనే నిర్ణయానికి వచ్చామని బహిరంగంగానే చెబుతున్నారు. అయితే ఎక్కువ మంది జనసేన పార్టీలో చేరాలని భావిస్తున్నట్లు తెలిస్తోంది. ఏదిఏమైనా వారం రోజుల్లో భోగాపురం మేజర్ పంచాయతీలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారనున్నాయి.

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి

ప్రజాశక్తి - నెల్లిమర్ల


చదువుతున్న విద్యార్థులు

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నామని కెజిబివి ప్రిన్స్‌పాల్ బూర్లే ఉమా తెలిపారు. ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి విశేషమైన కృషి చేస్తున్నామని చెప్పారు. వెనుక బడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా వారి పై దృష్టి సారించి ఆయా సబ్జెక్టుల్లో తర్ఫీదు ఇచ్చి పది పరీక్షలకు సిద్ధం చేశామన్నారు. సబ్జెక్టులు వారీగా వారంతపు పరీక్షలు నిర్వహించి తిరిగి ఆయా సబ్జెక్టులు మొత్తం (గ్రాండ్ టెస్ట్) పరీక్షలు నిర్వహించి తరువాత ప్రీ ఫైనల్ టెస్టులు జరిపి పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేశామన్నారు. పదో తరగతి పరీక్షల కోసం రాత్రి వేల సబ్జెక్ట టీచర్లతో రివిజన్ వర్కులు జరిపి తిరిగి ఉదయం దానిపై పరీక్షలు రాయించి విద్యార్థుల మెదడుకు పదును పెడుతున్నామన్నారు. కాగా పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి తరగతి ఉపాధ్యాయులు, సిబ్బంది దగ్గరుండి చదివించడంతో శతశాతం ఉత్తీర్ణత సాధిస్తామని నమ్మకం ఉందని ఆమె తెలిపారు.

మున్సిపల్ స్థలంలో ఇళ్ల పట్టాలివ్వాలి

ప్రజాశక్తి- బొబ్బిలి



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నివసించే చిక్కాల, రెల్లివీధికి అనుసరించి ఉన్న మున్సిపల్ స్థలంలో పారిశుధ్య కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మున్సిపల్ స్థలం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాటాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ స్థలంలో ఇళ్ల పట్టాలు ఇస్తామని 1992లో ప్రభుత్వం ఒకొక్కరు నుంచి రూ.350 కట్టించుకుని ఇళ్ల పట్టాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఇళ్ల పట్టాలు ఇస్తామన్న స్థలంలో మున్సిపల్ అధికారులు మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఇరుకు ఇళ్లల్లో రెండు నుంచి మూడు కుటుంబాలు నివసించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, ప్రభుత్వం స్పందించి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే మున్సిపల్ స్థలాన్ని ఆక్రమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు జి.వాసు, జగదీష్, ప్రజలు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమ్మికాపల్లి వినాయక్ నగర్ వద్ద ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 42 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వంద మందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చెరుకూరి నాగరాజు, వాసవి యువసేన అధ్యక్షులు మూర్కూరి సునీల్, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, కట్టమూరి సతీష్, మెడికవర్ డాక్టర్ సాయి చందు, మెడికల్ క్యాంప్ ఆర్గనైజర్ నాయుడు, ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి పాల్గొన్నారు.

దళిత ద్రోహి సిఎం జగన్ : కోండ్రు

ప్రజాశక్తి- రాజాం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు మురళి

సిఎం జగన్ దళిత ద్రోహి అని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కోండ్రు మురళి అన్నారు. మండలంలోని శ్యాంపురం టిడిపి క్యాంపు కార్యాలయంలో వంగర మండలంలోని కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన 40 ఎస్‌టి కుటుంబాలు కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం టిడిపిలో చేరాయి. వీరిని సాదరంగా ఆహ్వానించి కండువాలు వేవారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ చంద్రబాబు దళితుల కోసం ప్రత్యేకంగా 27 పథకాలు అమలుచేస్తే, సిఎం జగన్ మోహన్ రెడ్డి వాటిని రద్దు చేశారన్నారు. నాలుగు లక్షల మందికి ఉపాధి కల్పించే దళిత కార్పొరేషన్ను తుంగలో తొక్కాడని గుర్తు చేశారు. కోడికత్తి డ్రామాతో దళిత బిడ్డ శ్రీనివాస్‌ను ఏళ్ల తరబడి జైలుపాలు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వంగర మండల నాయకులు పిన్నింటి మోహన్‌రావు, భీమవరం భాస్కరరావు, లచ్చు భుక్త కృష్ణమూర్తి, వై దుర్గారావు, బెజ్జిపురపు రవి, బలిజి రెడ్డి శ్రీను, బెజ్జి పురపు త్రినాథ, బి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి ఎంపిటిసి

బొబ్బిలి: మండలంలోని ఎం.బూర్జవలస ఎంపిటిసి గునుపూరి దేవి, ఆమె భర్త శ్రీనివాసరావు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. కోటలో ఆదివారం నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి బేబినాయన, రాజా కండువాలు వేసి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుకు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎంపిటిసితో పాటు మరో 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: ఎంపి

ప్రజాశక్తి- తెర్లాం


మాట్లాడుతున్న ఎంపి బెల్లాన చంద్రశేఖర్

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. ప్రతి కుటుంబాన్ని బూత్ కమిటీ సభ్యులు సంప్రదించి వైసిపి ప్రభుత్వంలో ఆ కుటుంబానికి అందిన లబ్ధిని వివరించాలని సూచించారు. ఆదివారం మండల పరిధిలో గల బూత్ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లు ఉండరాదనే లక్ష్యంతో బూత్ కమిటీలను పక్కాగా నియమించామని ప్రతి ఇంటితోనూ పార్టీ క్యాడర్ మమేకం అవ్వవలసిన అవసరం ఉందని అన్నారు. ప్రతి బూత్ స్థాయిలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి 'మేము సిద్ధం మా బూత్ సిద్ధం' అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిపి నర్సుపల్లి ఉమాలక్ష్మి, జిల్లా జేసిఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, నాయకులు గర్భాపు రామారావు, వైస్ ఎంపిపి చెపేన సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు, యువజన అధ్యక్షుడు మదాసు శేషగిరి, నాయకులు బోను అప్పలనాయుడు, మగ్రాపు జగన్నాధం, సర్పంచులు ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

32వ రోజుకు మిమ్స్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - నెల్లిమర్ల


మాట్లాడుతున్న సురేష్

స్థానిక ఆర్‌ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరశన శిబిరం 32వ రోజుకు చేరుకుంది. ఆదివార నిరశన శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ సందర్శించి మాట్లాడుతూ నెల గడుస్తున్న మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించక పోవడం అన్యాయమన్నారు. ముఖ్యంగా జనవరి నెల పనిచేసిన కాలానికి జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే 7 డిఎ బకాయిలు, వేతన ఒప్పందం చేయాలని గత నెల రోజులుగా మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు నిరశన పోరాటం చేస్తుంటే యాజమాన్యం గాని ప్రభుత్వ అధికార్లు గానీ పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇంత జరుగుతున్నా ప్రజా ప్రతినిధులు కూడా మనకెందుకులే అన్న విధంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న న్యాయ పోరాటానికి మద్దతు పలికి వారి సమస్యలు పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కొమ్మూరి మధు, మహంతి రాంబాబు, అప్పలనాయుడు, గౌరి, బంగారు నాయుడు, నాగభూషణం, ఆదినారాయణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'అధికార పార్టీకి తొత్తుగా ఎపిఎం'

ప్రజాశక్తి - వేపాడ

వైకెపి ఎపిఎం అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారని పాటూరు సర్పంచ్ కొట్యాట వెంకటలక్ష్మి ఆరోపించారు. ఆమె బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారని ఈ పనులకు సంబంధించిన బిల్లులకు గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు, విఒఎలు ద్వారా బ్యాంకు ఎకౌంటు ఓపెన్ చేయవలసి ఉందన్నారు. బ్యాంకు ఎకౌంటు ఓపెన్ చేసే బాధ్యత వెలుగు ఎపిఎంకు ప్రభుత్వం అప్పగించిందని దీంతో ఆయన ప్రతి గ్రామంలో సర్పంచ్, ఎంపిటిసి, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో సమావేశాలు ఏర్పాటు చేసి బ్యాంకు ఎకౌంట్లుపై ఆరా తీస్తున్నారని చెప్పారు. అయితే తమ గ్రామంలో మాత్రం సర్పంచ్ అయిన తనకు, ఉప సర్పంచ్ కొట్యాడ రమణమూర్తికి చెప్పకుండా వైసిపి నాయకులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేసుకుని బ్యాంకు అకౌంట్‌లను తీసుకుంటున్నారని ఇది ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. కేవలం టిడిపి మద్దతుదారులమన్న ఆలోచనతోనే పంచాయతీ తీర్మానం లేకుండా ఎపిఎం ఇష్టానుసారంగా వైసిపి నాయకులతో చేతులు కలిపి అకౌంట్లు ఓపెన్ చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ఎపిఎం శ్రీనివాసరావును వివరణ కోరగా రెండు మూడు రోజుల్లో గ్రామంలో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

డిఎస్‌సి శిక్షణకు స్పందన

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని గర్భాం రవితేజ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గత కొంత కాలంగా నిరుద్యోగులకు ఇస్తున్న డిఎస్‌సిఉచిత శిక్షణకు అనూహ్య స్పందన లభిస్తుంది. ఈ శిక్షణ కార్యక్రమానికి ఆదివారం రాష్ట్ర స్థాయి శిక్షణా నిపుణులు అప్పారావు హాజరై అభ్యర్థులకు మెలుకవలు నేర్పించారు. ఆయా సబ్జెక్టులలో, సైకాలజీలో ఏవిధమైన నైపుణ్యం పొందాలి, జనరల్ నాలడ్జ ఏవిధంగా ప్రిపేర్ అవ్వాలనే విషయం పై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సత్యరావు, టివివిఎస్ఎల్ నరసింహులు, విజినిగిరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం

- వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రేగిడి/రాజాం


రోడ్డు మధ్యలో కూలిపోయిన చెట్టు

రాజాం మున్సిపాలిటీ బొబ్బిలి సెంటర్‌లో మసీదు వద్ద ఉన్న భారీ వృక్షం ఆదివారం సాయంత్రం కూలిపోయింది. దీనివల్ల రాజాం టౌన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చెట్టుకూలిన సమయంలో కొండం పేటకు చెందిన శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంతో వెళ్లడంతో అతనిపై కూలిపోయింది. ఈ ప్రమాదంలో అతని తలకు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. అతని ద్విచక్ర వాహనం చెట్టు కింద ఇరుక్కుపోయింది. ఈ ఘటన తెలిసిన వెంటనే మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. చీపురుపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలన్నింటినీ పోలీస్ స్టేషన్ మీదుగా మళ్లించారు. సుమారు 2 గంటలు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

నేరాలు ఘోరాలు

మద్యంతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కాగితాపల్లి జంక్షన్ వద్ద గలావెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని 22 మద్యం బాటిళ్లతో ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఉణుకూరు గ్రామాల్లో ఉన్న వైన్స్ దుకాణం నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లు తీసుకు వెళ్లడంతో పోలీస్ దాడులలో పట్టుపడ్డాడు. బాటిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అతన్ని రాజాం కోర్టుకు తరలించామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని కొట్టక్కి జాతీయ రహదారి ఎరుకల పాకల వద్ద సాలూరు నుంచి విజయనగరం వెళ్తున్న కారు అదుపుతప్పి రహదారి పక్కన బోల్తా పడడంతో కారు నడుపుతున్న తాడుతూరు శ్రీనివాసరావు (26) ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మృతుడు శ్రీనివాసరావు సాలూరు బంగారమ్మ కాలనీకి చెందిన వాడని, టాక్సీకారు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడని ఇదే క్రమంలో ఆదివారం విజయనగరం వెళుతుండగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కన గోతిలో పడి అక్కడ ఉన్న ప్రహరీని ఢీకొట్టి బోల్తా పడటంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. తమకి వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని సంఘటన జరిగిన తీరు పరిశీలించి, పంచనామా నిర్వహించి మృతదేహాన్ని బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. ఇతనికి ఇంకా వివాహం కాలేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


మృతి చెందిన శ్రీనివాసరావు

చుక్కల మందుకు చక్కని స్పందన

ప్రజాశక్తి - కొత్తవలస

పోలియో రహిత సమాజం సృష్టించడానికి మనమంతా కృషి చేయాలని కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం తన కార్యాలయం వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా పోలియో చుక్కలు పోలియో మహమ్మారిని పారదోలడానికి ముందుకు రావాలన్నారు. రైల్వే స్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, వివిధ ముఖ్య కేంద్రాల వద్ద ప్రత్యేక పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశారు.

తెర్లాం: స్థానిక పిహెచ్‌సి పరిధిలో ఆదివారం 3456 మంది పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేశామని డాక్టర్ ఆర్ శ్రీనివాసరావు, డాక్టర్ దివ్యభారతి తెలిపారు. పెరుమాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ వెంకటేష్ తమ బృందంతో కలిసి పెరుమాలి అంగన్వాడి సెంటర్-1 వద్ద పోలియో చుక్కలు వేశారు. తెర్లాం ఫార్మసిస్ట్ ఎన్ నాగేశ్వరరావు, పెరుమాలి పిహెచ్‌సి సిహెచ్ఒ పుష్పలత, ఎఎన్ఎం జి భవాని అంగన్వాడీ కార్యకర్త ఎన్ లక్ష్మి, పాల్గొన్నారు.


కొత్తవలస: చుక్కల మందు వేస్తున్న సర్పంచ్ రామస్వామి

నెల్లిమర్ల: పోలియో రహిత సమాజం స్థాపన ప్రభుత్వ ధ్యేయమని ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ గదల బంగారమ్మ అన్నారు. ఆదివారం కొండవెలగాడలో పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆమె పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొయిద అక్కోజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలోని సెవెంత్ డే పాఠశాలలో ఆదివారం పల్స్ పోలియోను మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ప్రారంభించారు. వార్డులు, ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్‌లో పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీ, కమిషనర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

పోలియో సిబ్బందికి ఆహార పొట్లాలు పంపిణీ


పోలియో కేంద్రాలు వద్ద పోలియో చుక్కలు వేసిన వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, కోశాధికారి ఎస్.శ్రీనివాస్ ఆహార పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పోలియో రహిత ప్రపంచాన్ని నిర్మించేందుకు రోటరీ క్లబ్ పని చేస్తుందని రాజు, శ్రీనివాస్ అన్నారు.

రేగిడి: మండలంలోని సంకిలి, ఉంగరాడ మెట్ట, రేగిడి, ఆమదాలవలస తదితర గ్రామాల్లో పల్స్ పోలియో కేంద్రాలను రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అసిరి నాయుడు ఆదివారం పరిశీలించారు. సున్న ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో తప్పనిసరిగా వేయాలన్నారు. పిహెచ్ఎన్, హెల్త్ సూపర్‌వైజర్, ఎఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: బొద్దాం, వేపాడ పిహెచ్‌సి పరిధిలో సుమారు 6344 మంది పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి ధరణి తెలిపారు. నర్సిపల్లి మెట్ట, సోంపురం పరిధిలో కూడా వ్యాక్సిన్ వేశామన్నారు. ఈ కార్యక్రమంలో బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారి ఎల్ రమాదేవి, డాక్టర్ శివాని, ఎంపిపి డి. సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ఐదేళ్లు లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని రామభద్రపురం, ఆరికతోట పిహెచ్‌సి వైద్యాధికారులు దిలీప్ కుమార్, రత్నదీపక్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్లో టిడిపి రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి చింతల రామకృష్ణ చేతుల మీదుగా చిన్నారులకు చుక్కల మందు వేయించారు. మిగిలిన అన్ని ప్రాంతాల్లో నియమిత సిబ్బంది ఆధ్వర్యాన పిల్లలకి చుక్కల మందు వేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, అంగన్వాడీ, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

గంట్యాడ: మండలంలోని గంట్యాడ, పెదమజ్జిపాలెం, ఆరోగ్య కేంద్రాలలో ఆదివారం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గంట్యాడ ఆరోగ్య కేంద్రం పరిధిలో 3729 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేసినట్లు డాక్టర్ హేమలత, వెంకటేశ్వరరావు తెలిపారు. పెదమజ్జిపాలెంలె 2654 మంది పిల్లలకు చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు పల్లవి, సతీష్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒ రాజేష్, తిరుపతిరావు, ఈశ్వరరావు, ఎర్రన్న పాల్గొన్నారు.


వేపాడ: పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ ధరణి

భోగాపురం: మండలంలోని సవరవల్లి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రాన్ని ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఆమె చేతుల మీదుగా చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి తిరుపతి స్వామి, ఎంపిడిఒ చంద్రకళ, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి, ఎంపిటిసి తాతయ్యలు తదితరులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: మండలంలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మెరక ముడిదాం, గర్భాం పిహెచ్‌సిలకు చెందిన వైద్య బృందాలు గ్రామాల్లో పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, వార్డు మెంబర్ తాడేలా లక్ష్మణరావు పాల్గొన్నారు.